## క్లుప్తంగా

### కల్యాణం.. కమనీయం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**సరుబుజ్జిలి:** పురుషోత్తపురం గ్రామంలో ఉమా కామేశ్వర స్వామివారి కల్యాణం గురువారం వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ, వేదపండితులు బంకుపల్లి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, మహారుద్రాభిషేకాలు, సహస్రనామార్చనలు చేశారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### 104 వాహనాల్లో 4జీ సేవలు



4జీ సేవలు అమర్చుతున్న సిబ్బంది

**నరసన్నపేట:** ప్రభుత్వ ఆదేశాల మేరకు 104 వాహనాల్లో 4 జీ సేవలు అందుబాటులోనికి తీసుకువస్తున్నట్లు డీఎఫ్ఎం ఇమ్రాన్ తెలిపారు. గురువారం ఆయన నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు వాహనాలకు 4జీ సేవలను ఇన్‌స్టాల్ చేశారు. ప్రస్తుతం 2జీ సేవలు ఉన్నాయని, వీటిని 4 జీ కింద మార్చి జీపీఎస్ అమర్చినట్లు వివరించారు. 104 వాహనం ట్రాకింగ్ మరింత మెరుగుపడుతుందన్నారు. 104 వాహనం ఏ సమయానికి ఎక్కడుందనేది స్పష్టంగా తెలుసుకోవచ్చన్నారు.

### విద్యార్థులకు అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న సత్యనారాయణ

**సరుబుజ్జిలి:** ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పురుషోత్తపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు గురువారం అభినందించారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించనున్నట్లు రిటైర్డ్ దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ గున్ను నర్సింమూర్తి, ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, కాంట్రాక్టర్ మొదలవలస ఆంజనేయులు, హెచ్ఎం తులసీరావు పాల్గొన్నారు.

### రూ.15 వేల ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

**సారవకోట:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986లో తమతోపాటు 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థికి ఆ బ్యాచ్ విద్యార్థులు గురువారం ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దలంబ గ్రామానికి చెందిన కొర్లాపు ఈశ్వరరావుకు రూ.15 వేలు అందజేశారు. ఆ బ్యాచ్ విద్యార్థులు బొంగు కొండయ్య, యాళ్ల జనార్దనరావు, వాన కామేశ్వరరావు, వాన యర్రయ్య, సోమేశ్వరరావు, ముఖలింగం ఉన్నారు.

### పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం



పాఠశాలను పరిశీలిస్తున్న ఎన్ఆర్ఐలు

**పొందూరు:** తాడివలస పాఠశాల అభివృద్ధికి తాము అన్ని వేళలా సిద్ధంగా ఉన్నామని ఆ గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐలు తమ్మినైన అప్పలనాయుడు, టి.వరప్రసాద్ హామీ ఇచ్చారు. పాఠశాలను గురువారం సందర్శించారు. ఇదే పాఠశాలలో చదువుకుని తాము విదేశాలలో ఉద్యోగాల్లో రాణిస్తున్నామన్నారు. చదువులో రాణించడానికి పట్టుదల, చిత్తశుద్ధి ఉండాలని, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలకు ఏవిధమైన ఆర్థికసాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని హెచ్ఎం హేమనాచార్యులుకు తెలిపారు.

### మొక్కలతోనే మానవ మనుగడ

**జలుమూరు:** మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని, మొక్కలతోనే మానవ మనుగడ అని ఎంపీపీ వాన గోపి అన్నారు. గురువారం జలుమూరు కేజీబీవీలో మొక్కలు నాటారు. ఎస్ఓ శారద, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- ప్రకృతి వ్యవసాయంతో భూసారం
- ఆరోగ్యవంతమైన పంటలపై అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వం

ప్రకృతి వ్యవసాయం సాగు వివరాలు

| మండలం | సాగు విస్తర్ణం | రైతుల సంఖ్య | పంచాయతీలు |
|---|---|---|---|
| కొత్తూరు | 3,800 | 4,652 | 20 |
| ఎల్ఎన్‌పేట | 1,232 | 1,237 | 10 |
| హిరమండలం | 1,150 | 1,625 | 15 |
| మెళియాపుట్టి | 800 | 956 | 13 |
| పాతపట్నం | 4,850 | 6,820 | 34 |

**కొత్తూరు:** ప్రస్తుత రోజుల్లో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆహారపు అలవాట్లు కూడా అందుకు అనుగుణంగా మార్చుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండే పంటలు ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిండంతో ప్రభుత్వాలు కూడా రసాయన ఎరువుల వాడకం తగ్గించి, పకృతి వ్యవసాయం చేయాలని అనేక సదుపాయాలు కల్పిస్తున్నాయి.

**అధిక మోతాదు రసాయన ఎరువులతో నష్టం..**

రసాయన ఎరువులు వినియోగంతో పండించిన పంటలు ఆహారంగా తీసుకోవడంతో క్యాన్సర్‌తోపాటు పలు ప్రమాదకరమైన వ్యాధుల బారినపడుతున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో పెట్టుబడులు పెరగడంతో రైతులకు గిట్టుబాటుగాక వ్యవసాయానికి దూరమవుతున్న పరిస్థితులున్నాయి. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే భవిష్యత్ తరం వారు వ్యవసాయం చేసేందుకు భూములు ఉపయోగపడకుండా పోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రభుత్వం తిరిగి సంప్రదాయ వ్యవసాయం (ప్రకృతి వ్యవసాయం), గో ఆధారిత వ్యవసాయాన్ని తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది.

**ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు..**

పూర్వం మాదిరిగా సహజవనరులను వినియోగించుకుని సాగుచేయడమే ప్రకృతి వ్యవసాయం. ఆవుపేడ, పంచికంతోపాటు వేప, పెరుగు, కొబ్బరి నీరు, బెల్లం, పలు రకాల సహజ వస్తువులతో తయారు చేస్తున్న నీమాస్త్రం, ఘన జీవామృతం, ద్రవజీవామృతం వంటి కషాయాలు, ద్రావణాలు పంటలకు పిచికారీ చేయడం ద్వారా పురుగులు నాశనం అవుతాయి. ఆవుపేడ, కుళ్లిన గంతం, ఆకులు, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించడంతో భూసారం పెరుగుతుంది. పంటలకు ఎటువంటి పురుగులు, తెగుళ్లు ఆశించవు. ఇటువంటి పంటలు ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారు. ఈ పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది.

**ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి..**

ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి, కూరగాయలు, మినుము, పెసర వంట పంటలను సాగు చేస్తున్నారు. సహజ వనరులను వినియోగించి సాగు చేయడంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు. రైతులకు గిట్టుబాటుగా ఉన్నందున ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో (92 పంచాయతీల్లో) 11,832 ఎకరాల్లో 15,290 మంది రైతులు వరి, కూరగాయలు, అపరాలు, అటవీ, పండ్ల తోటలు, పలు రకాల వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారు.

**ప్రకృతి సాగు పెంచేందుకు కృషి..**

ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగుపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు, రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడం జరుగుతుంది. భావితరాలకు ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరం. ప్రకృతి వ్యవసాయం సాగు పెంచేందుకు కృషిచేస్తున్నాం.

– కె.బాబాజీ, ఎస్‌డీఏ, కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్

**మార్కెట్ సదుపాయం కల్పించాలి...**



తాను జామి పంటను ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్నాను. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న పంటలకు మార్కెట్ సదుపాయం కల్పించాలి. జీవామృతం, నీమాస్త్రం, ఘనజీవామృతంతోపాటు పలు రకాల మందులు ప్రభుత్వమే రైతులకు రాయితీపై అందించాలి.

– ఊయక చిన్నమ్మి, గిరిజన రైతు, శోభనాపురం ఎస్టీ కాలనీ, కొత్తూరు మండలం

**రాయితీలు కల్పించాలి...**



ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం మరిన్ని రాయితీలు కల్పించాలి. రసాయన ఎరువులకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేలా, ప్రకృతి వ్యవసాయం సాగుచేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు అందజేయాలి.

– చోడవరపు హరిదాసు, రైతు, కొత్తూరు

# సుధాకర్ విజయమే లక్ష్యం



పాతపట్నం: ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

**పాతపట్నం:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్ విజయానికి పార్టీ నాయకులకు కృషిచేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలికుడు, ఎమ్మెల్సీ (నెల్లిమెర్ల) పి.వి.సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు)తో కలిసి పార్టీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఓటరును స్వయంగా కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు. ఒక్కో నాయకుడు కనీసం వంద మంది పట్టభద్రులను కలవాలన్నారు. ఎమ్మెల్సీ సురేష్ బాబు మట్లాడుతూ పట్ట భద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటును సీతంరాజుకు వేసి గెలిపించాలన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. మెళియాపుట్టి జెడ్పీటీసీ గూడ ఎండయ్య, పాతపట్నం, హిరమండలం, కోసమాల, ఎల్.ఎన్.పేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామ్‌సుందరావు, ఎ.వి.సురేష్, బాలరాజు, కృష్ణ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ కె.అర్జునుడు, తాతయ్య, వైస్ ఎంపీపీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

**సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి**

**ఆమదాలవలస:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను పార్టీ నాయకుడు చింతాడ రవికుమార్ కోరారు. మున్సిపాలిటీ పరిధి లక్ష్మిడిపేట, వెంకటయ్యపేట గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఆమదాలవలస: వెంకయ్యపేటలో ప్రచారం చేస్తున్న చింతాడ రవికుమార్



హిరమండలం: పార్టీ కరపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**హిరమండలంలో ప్రచారం..**

**హిరమండలం:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని సీతంరాజు సుధాకర్‌కు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల వెంకటరామక్రిష్ణ, వి.చిన్నారావు కోరారు. హిరమండలం మేజర్ పంచాయతీలో గురువారం ప్రచారం నిర్వహించారు. వెలమల బాలరాజు, పి.రమణమూర్తి, టి.తవుడు, బి.శ్రీనివాసరావు, మురళి, సింహాచలం, మోహన్‌రావు పాల్గొన్నారు.

# యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



ఎల్.ఎన్.పేట: కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు




జలుమూరు: అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హర్షవర్ధన్, పురుషోత్తమరావు

**ఎల్.ఎన్.పేట:** యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శివ్వాల చంద్రశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని రోటరీనగర్ పాఠశాల వద్ద గురువారం జరిగిన ఎన్నికల్లో ఎల్.ఎన్.పేట మండల కమిటీ సభ్యుల వివరాలను ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా పి.వి.రమణ, అధ్యక్షుడిగా పైడి రాజు, సహ అధ్యక్షుడిగా పి.జయ, ఎస్.జయరాం, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.ఢిల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి.చిన్నారావు, మండల కార్యదర్శులుగా ఎం.బాలసుబ్రహ్మణ్యం, పి.జున్నుకుమారి, ఆర్.కృష్ణారావు, కె.దీనకుమారి, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎం.జయరాం, సి.హెచ్.వి.రమణ, జి.సన్యాసిరావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

**యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా హర్షవర్ధన్**

**జలుమూరు:** యూటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగినట్లు పూర్వ అధ్యక్షుడు జి.రాము తెలిపారు. జలుమూరు మండల ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.వి.హర్షవర్ధన్, ఎస్.పురుషోత్తమరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా యు.రామారావు, ఎం.రాజారావు, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.వెంకటరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జి.రాము, పరిశీలకులుగా కె.వైకుంఠరావు వ్యవహరించారు. వీరికి మండలానికి చెందిన ఉపాధ్యాయులు అభినందించారు.

# మహిళలకు స్వయం ఉపాధి

**ఆమదాలవలస:** మహిళలకు వివిధ సంస్థల ద్వారా అందిస్తున్న శిక్షణలను వినియోగించుకోవాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జె.జె.మోహన్‌రావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనగర్‌లో గల సత్యసాయి సేవా సంస్థలో జిల్లా స్థాయి సంస్థల స్కిల్ డవలప్‌మెంట్ ద్వారా మహిళలకు గత 90 రోజులుగా అందిస్తున్న టైలరింగ్ శిక్షణ తరగతుల ముగింపు సభలో పాల్గొన్నారు. సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, శిక్షకురాలు ఎ.లీలారాణి, విద్యాజ్యోతి రాష్ట్ర, జిల్లా సమన్వయకర్తలు ఎస్.వి.గురుప్రసాద్, ఎం.జనార్దనరావు, తమ్మన బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డైరెక్టర్ జె.జె.మోహన్‌రావు

# ద్రవజీవామృతంతో సూక్ష్మజీవుల వృద్ధి



ద్రవజీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**కొత్తూరు:** ద్రవజీవామృతంతో రబీలో సాగు చేస్తున్న మినుము, పెసర, నువ్వు పంటలపై పిచికారీ చేయడంతో నేలలో ఉన్న సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ సవర సూర్యనారాయణ అన్నారు.

శోభనాపురం గ్రామంలో పలు కషాయాల తయారీపై గిరిజన మహిళా రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ద్రవజీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం వంటి పలు రకాల కషాయాలు పంటలకు పిచికారీ చేయడంతో భూసారం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పరామర్శ

**మెళియాపుట్టి:** మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కప్ప భానుప్రకాష్ రెడ్డి బుధవారం అనారోగ్యకారణంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. పార్టీకి భానుప్రకాష్‌రెడ్డి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. వసుంధర గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ సలాన మోహన్‌రావు సోదరుడు ఎరుకు నాయుడు ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, పార్టీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, మండల వైస్ కన్వీనర్లు కరణం శశిభూషణ్ రావు, తేజారావు, మండల సచివాలయ కన్వీనర్ల ఇంచార్జి గణపతి ప్రధాన్, స్థానిక నాయకులు ఆర్.వాసు, పోలాకి జయమునిరావు, పరపటి యోగీశ్వరరావు ఉన్నారు.



భానుప్రకాష్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

## నేడు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు పర్యటన

**ఆమదాలవలస రూరల్:** రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం శుక్రవారం ఉదయం 9 గంటలకు మండలానికి వస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో కొత్తరోడ్ జంక్షన్‌లో ఉన్న వెలాసిటి ఇంటర్నేషనల్ స్కూల్‌కు రానున్నారు. ఈ స్కూల్ యాజమాన్యం అర్ధంతరంగా విద్యా సంవత్సరం చివరిలో తరగతులు నిలిపివేస్తున్నట్లు తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు రావడంతో విచారపట్టనున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

## శ్రేయమిశ్రోకు సమ్మోహన్ అవార్డు



ప్లేట్‌లో నృత్యం ప్రదర్శన చేస్తున్న శ్రేయమిశ్రో

**పాతపట్నం:** నేషనల్ ఆర్ట్స్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ఇటీవల కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన నృత్య పోటీల్లో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయమిశ్రో ప్రతిభ కనబర్చింది. మహిషాసుర మర్దిని, పల్లెంతో (ప్లేట్ డాన్స్) నృత్యానికి జాతీయ స్థాయిలో సమ్మోహన్ అవార్డు సాధించింది. సంగీతం, నృత్యం, గానం, చిత్రలేఖనంలో దివ్యాంగులకు జాతీయ స్థాయిలో ఈ పోటీలు నిర్వహించారు. నిర్వహకుడు గోపీనాథర్, కేరళ ముఖ్యమంత్రి విజయన్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు శ్రేయమిశ్రోను అభినందించారు. శ్రేయమిశ్రోకు మంచి గుర్తింపు రావడంపై తల్లిదండ్రులు శివప్రసాద్ మిశ్రో, పద్మావతి మహాపాత్రో, పాతపట్నం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఓటర్ల జాబితా ప్రచురణ

**సరుబుజ్జిలి:** మండలంలో ఖాళీగా ఉన్న చిన కాగితాపల్లి, తెలికిపెంట ఎంపీటీసీ స్థానాల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీఓ పీవీ మురళీమోహన్‌కుమార్ గురువారం ప్రకటించారు. ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రకారం ఆయా ఎంపీటీసీలకు సబంధించి ఓటర్లు జాబితాలు మండల పరిషత్, తహసీల్దార్, గ్రామ సచివాలయాల కార్యాలయాల వద్ద ప్రచురించామని వెల్లడించారు.

## నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

**నరసన్నపేట:** మండల కేంద్రం నరసన్నపేటలో సంపత్ సాయి, పద్మావతి, శాంత, జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల మధ్య జరుగుతున్నాయి. గురువారం ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. నరసన్నపేటలో 1810 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయి.

# తరగతులు నిర్వహించకుంటే చర్యలు




విచారణ చేస్తున్న డిప్యూటీ ఈఓ తిరుమల చైతన్య

**ఆమదాలవలస రూరల్:** విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం తరగతులు నిర్వహించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ఈఓ తిరుమల చైతన్య అన్నారు. మండలంలో కొత్తరోడ్ జంక్షన్‌లో ఉన్న వెలాసిటీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం విచారణ జరిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్కూల్ యాజమాన్యం నుంచి వివరాలు సేకరించారు. గత మూడు నెలల నుంచి విద్యార్థులకు తరగతులు నిర్వహించకపోవడంతో చదువులపై తీవ్ర ప్రభావం చూపాయని తల్లిదండ్రులు తెలియజేశారు. ఫీజులు వసూలు చేసి విద్యార్థులకు చదువులు చెప్పకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వ్యవహరించడం సరికాదని వెల్లడించారు. విద్యా సంవత్సరం ముగిసే వరకు స్కూల్‌లో తరగతులు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రుల కమిటీని ఎంపిక చేసి ఎటువంటి సమస్యలు ఉన్నా విద్యాశాఖ దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలిగిస్తే స్కూల్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఈఓ డి.రామారావు ఉన్నారు.

# లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం

**కొత్తూరు:** మండలంలోని గురండి పంచాయతీ పరిధి దాశరదీపురంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఏర్పాటు చేయడంతో లో ఓల్టేజ్ సమస్య తీరింది. ఈ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ సమస్యలను సర్పంచ్ బోర సింహాద్రినాయుడు గుర్తించారు. సర్పంచ్ సూచనల మేరకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం గ్రామ సచివాలయం ఎనర్జీ అసిస్టెంట్ దరఖాస్తు చేశారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేశారు. విద్యుత్ సిబ్బంది, గ్రామస్తుల సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

# 4న శ్రీకాకుళంలో ప్రజావేదిక

**కొత్తూరు:** మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 15వ విడత సోషల్ ఆడిట్ (ప్రజావేదిక) ఈ నెల 4న శ్రీకాకుళంలోని డ్వామా కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ప్రేమలత గురువారం తెలిపారు. కొత్తూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించాల్సి ఉన్నప్పటికీ.. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శ్రీకాకుళంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మండలంలో 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2021 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి పథకం ద్వారా ఖర్చు చేసిన పనులకు సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు.

# 31 లోగా రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

**కొత్తూరు:** మండలం వ్యవసాయ ప్రాథమిక సహకారం సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు నాలుగు శాతం వడ్డీతో ఈ నెల 31 లోగా రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ గురువారం తెలిపారు. రుణాలు సకాలంలో రెన్యువల్ చేయకపోతే ప్రభుత్వ కల్పిస్తున్న వడ్డీ రాయితీ వర్తించదన్నారు.

# పారదర్శకంగా పథకాల నమోదు

**మెళియాపుట్టి:** మిషన్ అంత్యోదయ వివరాల నమోదు పారదర్శకంగా జరగాలని ఎంపీడీఓ పడాల చంద్రకుమారి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మిషన్ అంత్యోదయ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నమోదును బాధ్యతగా చేపట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై వివరాలు తెలియజేయాలన్నారు. కార్యదర్శుల విధుల్లో ఫేషియల్ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. పరిపాలనాధికారి తిరుపతి పట్నాయక్ ఉన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

**నరసన్నపేట:** పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు పాడి రైతులు వేయించాలని స్థానిక పశువైద్యశాఖ ఏడీ రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం నుంచి గ్రామాల్లోకి పశు వైద్య సిబ్బంది వచ్చినప్పుడు రైతులు పాడి పశువులను తీసుకుని రావాలని సూచించారు. ఈ టీకాలు వేయకపోతే పశువులు వివిధ వ్యాధులకు గురికావచ్చని, ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తుందన్నారు. నరసన్నపేట, పోలాకి మండలాల్లో 28 వేల వరకు పాడి ఆవులు, గేదేలు ఉన్నట్లు తెలిపారు.

## సచివాలయం సందర్శన

**సారవకోట:** సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి వాసుదేవరావు సూచించారు. మండలంలోని అంగూరు సచివాలయాన్ని గురువారం సందర్శించారు. సచివాలయ సిబ్బందితో శాఖల వారిగా సమీక్షించి పలు అంశాలపై సలహాలు ఇచ్చారు. సంక్షేమ పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. నాడు–నేడు పనులు, గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి ఉన్నారు.